క్లుప్తంగా

నేడు ఆడికృత్తిక ఉత్సవాలకు అంకురార్పణ

శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలకు బుధవారం అంకురార్పణ చేయనున్నట్లు ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాత్రి 7.30 గంటలకు శ్రీవళ్లి, దేవసేన సమేత చెంగల్వరాయస్వామి వారికి పూజాదికార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏడు లారీల సీజ్



సీజ్ చేసిన లారీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, రెడ్డిగుంటబాడవ గ్రామాల సమీపంలో గ్రావెల్ మట్టిని తరలిస్తున్న ఏడు లారీలను మంగళవారం ఎస్‌ఐ వెంకటనరసింహం సీజ్ చేశారు. గ్రావెల్ మట్టిని ఆలత్తూరు, కొత్తపాళెం, రౌతుసూరమాల, గ్రామాల వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో కాంట్రాకర్ వేస్తున్న రోడ్డుకు లారీల ద్వారా గ్రావెల్ మట్టిని తరలిస్తున్నారు. మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని ఎస్‌ఐ వెంకటనరసింహం లారీలు సీజ్ చేసి, పోలీసుస్టేషన్‌కు తరలించారు.

రుచికరమైన భోజనం పెట్టాలి



విద్యార్థులతో కలసి రాగిజావా తాగుతున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాల్లో అమలవుతున్న మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని, వంట నిర్వాహకులు అవకతవకలకు పాల్పడితే తొలగిస్తామని ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఆయన నెరిణికండ్రిగ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రాగి జావా తాగి, మధ్యాహ్నం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సజ్జ కొనుగోలు చేయండి

నారాయణవనం: మండలంలో సాగవుతున్న సజ్జ పట్టను ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ అధికారులతో కలిసి నారాయణవనం మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగలో పర్యటించారు. గ్రామంలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించి, అధికారులకు, క్షేత్ర స్థాయి సిబ్బందికి, రైతులకు యాజమాన్య పద్ధతులపై పలు సూచలు చేశారు. సజ్జ పంట పొలాలను సందర్శించిన ఆయన రైతులతో ముచ్చటించారు. విత్తనాల సేకరణ, పంట యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధిక లాభాలను చేకూర్చే సజ్జను దళారుల కారణంతో తక్కువ ధరకు అమ్ముకుంటున్నామని రైతులు ఈ సందర్భంగా వాపోయారు. బయట దొరికే వంగడాలు అధిక ధరలకు కొంటున్నామన్నారు. వేరుశనగ, వరితో పాటు సజ్జ విత్తనాలను సబ్సిడీపై ప్రభుత్వం అందివ్వాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా ఆయన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీలు రమేష్(పుత్తూరు), ధనుంజయ రెడ్డి(తిరుపతి), సుబ్రమణ్యం (సత్యవేడు), మండల వ్యవసాయాధికారి శోభారాణి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వరుస చోరీలు

శ్రీకాళహస్తి: పట్టణంలో ద్విచక్రవాహనాల వరుస చోరీలు వాహన యజమానులకు ఆందోళన కలిస్తున్నాయి. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయినగర్‌లో సోమ వారం రాత్రి మూడు ద్విచక్ర వాహనాలు చోరీ జరిగాయి. అలాగే ఒకటో పట్టణ పరిధిలో ఒక ద్విచక్ర వాహనం, అలాగే ఫిర్యాదు ఇవ్వకుండా మరో ద్విచక్ర వాహనం మాయం అయినట్లు సమాచారం. ద్విచక్ర వాహనచోదకులు తమ వాహనాలను బయట పెట్టాలంటే భయపడుతున్నారు. గతంలో ముగ్గురు వ్యక్తులు సాయిబాబానగర్ ప్రాంతంలో పర్యటించి రెండు వాహనాలను తస్కరించినట్లు సీసీ కెమెరాల్లో గుర్తించినట్లుగా పోలీసులు తెలిపారు. వరుసగా ఐదు ద్విచక్ర వాహనాలు మాయం కావడంపై ద్విచక్ర వాహన చోరీల ముఠా శ్రీకాళహస్తిలో సంచరిస్తోందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే గత నెల రోజుల్లో మూడు చైన్ స్నాచింగ్ లు జరిగాయి. ప్రస్తుతం వరుసగా ద్విచక్ర వాహనాలు చోరీ చూస్తుంటే దొంగలముఠా శ్రీకాళహస్తిలో సంచరిస్తోందా? అన్న అనుమానం కలుగుతోంది. దీనిపై డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డిని వివరణ కోరగా ద్విచక్ర వాహనాల చోరీపై సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ద్విచక్ర వాహనికి ప్రత్యేకమైన సైడ్‌లాక్, సాధారణ లాక్, వీల్‌లాక్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మీ మీదే ధ్యాస..

తీర్చాలి మా ఆశ



అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ అభివృద్ధికి బాటలు పడాలన్నా.. సమస్యలు పరిష్కారం కావాలన్నా.. స్థానిక ఎమ్మెల్యే శాసనసభలో గళం విప్పాలి. ప్రజాప్రతినిధి తనదైన రీతిలో గట్టిగా పోరాడి, తాము ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపి, ఆదర్శంగా తీర్చిదిద్దుతారని ఓట్లు వేసిన ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. వారి ఆకాంక్షలు ఏ మేరకు ఫలిస్తాయో వేచి చూడాలి మరి.

- నియోజకవర్గంలో పలు సమస్యలు
- సూపర్‌సిక్స్ అంటూ హామీలు గుప్పించిన టీడీపీ ప్రభుత్వం
- అసెంబ్లీలోఎమ్మెల్యే ఆదిమూలం సమస్యలు ప్రస్తావించేనా?

వరదయ్యపాళెం: సత్యవేడు ఎస్సీ రిజర్వ్ నియోజకవర్గ ప్రజలకు ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఇందుకు ఆధారమైన సాగు, తాగునీటి సమస్యలతోపాటు ఇతర సమస్యలు నియోజకవర్గంలో కోకొల్లలు. ఎన్నో సమస్యలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కారం చూపినా ఇంకా పలు సమస్యలు మిగిలే ఉన్నాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ సమస్యలను ఎంతమాత్రం పరిష్కరిస్తుందోనని నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారు. టీడీపీకి చెందిన కోనేటి ఆదిమూలం సత్యవేడు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ఏమాత్రం ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి ఏ మేరకు కృషి చేస్తారోనని ప్రజలు సర్వత్రా చర్చించుకుంటున్నారు.

రాచబాటల కల ఫలించేనా?



ఛిద్రమైన నాగలాపురం-టీపీకోట రోడ్డు



గుంతలమయమైన ఈపీపీ రోడ్డు



దెబ్బతిన్న కదూరు కూడలి-సత్యవేడు ప్రధాన రోడ్డు

సత్యవేడు పట్టణ ఇరుకురోడ్ల నుంచి మినహాయింపుగా బైపాస్ రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. ఇందుకు ప్రజాప్రతినిధి కృషి చేయాల్సివుంది. గత ప్రభుత్వంలో మంజూరైన సత్యవేడు, నాగలాపురం మండలాల పరిధిలోని దాసుకుప్పం బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. నాగలాపురం నుంచి టీపీకోటకు వెళ్లే రోడ్డు మార్గం విస్తరించాలి. బీఎన్‌కండ్రిగ-సూళ్లూరుపేట రోడ్డు కూడా డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేయాలి. నియోజకవర్గంలోని 7 మండలాల్లో గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం ఈపీపీ ద్వారా 36 రోడ్లు గత ప్రభుత్వంలో మంజూరయ్యాయి. అందులో 12 రోడ్ల నిర్మాణం పూర్తవ్వగా మరో 24 రోడ్లు పూర్తి కావాల్సి ఉంది. సత్యవేడు-కదూరు కూడలి, సత్యవేడు-ఊత్తుకోట ప్రధాన రోడ్డు మార్గాలు పూర్తిగా గుంతలమయమై వాహన రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. ఈ రెండు రోడ్లు అభివృద్ధి చెందాల్సి ఉంది.


విద్యకు పెద్దపీట వేసేనా?

సత్యవేడులో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలు నిర్మాణం చేయాల్సి ఉంది. ఈ భవనాల నిర్మాణంపై స్థానిక ఎమ్మెల్యే అసెంబ్లీలో గళం విప్పుతారో?లేదోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండల కేంద్రాల్లో డ్రైనేజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలి. రైతులకు ఎంతో అవసరమైన తెలుగుగంగ ఉపకాలువలకు ఆధునీకరణ పనులు చేపట్టాలి. రైతులకు ప్రధాన ఆయువైన తాగునీటి చెరువుల అభివృద్ధి పనులు చేపట్టాలి. ఆరణియార్ ప్రాజెక్ట్ ఆధునికీకరణకు గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలి.

సత్యవేడు సాక్షిగా బాబు హామీలు అమలయ్యేనా?



ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ 20న గాంధీ బొమ్మ కూడలిలో ఏర్పాటు చేసిన రోడ్‌షోలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సత్యవేడులో ఆర్టీఓ కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే సత్యవేడు, వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అంతేకాకుండా సత్యవేడు, దాసుకుప్పం ప్రాంతాల్లో బైపాస్ రోడ్లు నిర్మిస్తామని మాట ఇచ్చారు. అలాగే ఆంధ్ర-తమిళనాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ఉన్న సత్యవేడు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య అవసరాలకు సత్యవేడు ఆస్పత్రిని 100 పడకల స్థాయికి పెంచుతామన్నారు. ఈ సమస్యలపై ఏమాత్రం స్పందిస్తారో వేచి చూడాలి.

పురాతన భవనాలకు మోక్షం లభించేనా?



సత్యవేడులోని బ్రిటీష్ కాలం నాటి తహసీల్దార్ కార్యాలయం

బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెవెన్యూ కార్యాలయం, కోర్టు భవనం, సబ్ జైలు కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మాణం చేయాలి. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధి పోరాటం సాగించి, కొత్త భవనాల నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేయాల్సి ఉంది. అలాగే సత్యవేడు ప్రజల తాగునీటి అవసరాలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాల్సి ఉంది. శ్రీసిటీ పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగాలు కల్పన చట్టం అమలు చేయాలి.



సత్యవేడు చిహ్నంగా ఉండే టవర్ క్లాక్

సీహెచ్‌సీ స్థాయి పెంపు జరిగేనా?

నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు సీహెచ్‌సీకి రోగులు నిత్యం అధిక సంఖ్యలో వస్తున్నారు. ఇది 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చెందాల్సి ఉంది. ఎమ్మెల్యే ఈ సమస్య పరిష్కారానికి కృషి చేసి, ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయించాల్సి ఉంది.



100 పడకల స్థాయికి అభివృద్ధి చెందాల్సిన సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్

రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టాలి



నాగలాపురం- టీపీ కోట రోడ్డు సుమారు 15కి.మీల దూరం పూర్తిగా ఛిద్రమైంది. ఈ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనప్పటికీ పనులు జరగలేదు. ఎన్నికల రావడంతో పనులు ఆగిపోయాయి. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే ఆదిమూలం రోడ్డు నిర్మాణం పూర్తి చేయించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– దానివేలు, బీరకుప్పం, వరదయ్యపాళెం మండలం

సాగునీటి సమస్య పరిష్కరించాలి



కూటమి ప్రభుత్వం రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలు పరిష్కరించాలి. అందుకు అవసరమైన నీటి ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు గంగ నీరు చెరువులకు అందించాలి. అలాగే కాలువలు, చెరువులు కూడా అభివృద్ధి చేయాలి.

–మల్లికార్జునరెడ్డి, రైతు, వరదయ్యపాళెం మండలం

స్థానికులకు 75శాతం ఉద్యోగాలివ్వాలి



గత ప్రభుత్వం స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలన్న సదుద్దేశంతో ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకు 75శాతం ఉద్యోగ కల్పనకు చట్టం తెచ్చింది. ఆ చట్టాన్ని కూటమి ప్రభుత్వం కూడా కొనసాగించాలి. నియోజకవర్గ పరిధిలోని శ్రీసిటీ, ఇతర పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించేలా నియోజకవర్గ ఎమ్మెల్యే చొరవ చూపాలి.

– ప్రభాకర్, వరదయ్యపాళెం మండలం

పథకాలు అమలులో కాలయాపన



సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయలేకనే ప్రస్తుత ప్రభుత్వం ఓటాన్ బడ్జెట్ ప్రవేశపెడుతోంది. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక కాలయాపన కోసం పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం లేదని అర్థమవుతోంది. కూటమి ప్రభుత్వానికి ఎంతో నమ్మకంతో ప్రజలు పట్టం గట్టారు. అయితే ప్రజల నమ్మకానికి వమ్ము చేసే దిశగా అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత రావడం తథ్యం.

– చిన్నా, మాజీ సర్పంచ్, వరదయ్యపాళెం

సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం



నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: దేశం కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుందామని ప్రిన్సిపల్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం మన బాధ్యత అని, వారిని ఎప్పటికీ మరువకూడదన్నారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్, పీడీ నరసింహారావు, ధనుష్, సంఘవి, కీర్తి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య



విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివిస్తున్న ఎంఈఓ దయాకర్ రావు

ఏర్పేడు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నట్లు ఎంఈఓ-2 దయాకర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని కోబాక ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన అమలుపై ఆరాతీశారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభరీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్చాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని సూచించారు.

సచివాలయంలో పాము



సచివాలయం వద్ద పాము

నాగలాపురం: మండల కేంద్రంలోని ఒకటో సచివాలయం వద్ద విద్యుత్ మీటరు బోర్డుపై ఓ పాము వచ్చి చేరింది. సచివాలయ సిబ్బందితో పాటు పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది ఆ పామును చూసి మిన్నకుండిపోయారు. కొద్ది సేపటికి ఆ పాము తనంతట తానుగా బయటకు వెళ్లడంతో సచివాలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

40మందికి ఆధార్ సేవలు



దాసుకుప్పంలో ఆధార్ నమోదు చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ ప్రకాష్



ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ

సత్యవేడు: మండల పరిధిలోని దాసుకుప్పం, ఇరుగుళం సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన ఆధార్ కేంద్రాల్లో 40 మందికి ఆధార్ సేవలు అందించారని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. రెండు కేంద్రాల పరిధిలో చిన్నపిల్లల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, చిరునామా, పేరు మార్పు, ఫోన్ నంబర్ల మార్పులు చేసినట్లు డిజిటల్ అసిస్టెంట్లు ప్రకాష్, బాలాజీ తెలిపారు.

నాగలాపురంలో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ప్రారంభం

నాగలాపురం: మండల కేంద్రంలో సచివాలయంలో మంగళవారం ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ప్రారంభించారు. జిల్లా ఉన్నత అధికారులు ఆదేశాలు మేరకు మండలంలో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ పీఎంకే బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిరోజు 10 మందికి ఆధార్ కార్డు నమోదు, మొబైల్ నంబర్ అనుసంధానం, వేలి ముద్రలు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నదొరై సుధ, పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ, డిజిటల్ అసిస్టెంట్ హరి, అంగన్‌వాడీ సిబ్బంది విజయలక్ష్మి పాల్గొన్నారు.

సులభరీతిలో బోధించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు: విద్యార్థులకు అర్థమయ్యే సులభరీతిలో విద్యాబోధన చేయడమే జాతీయ విద్యా విధానం ఉద్దేశమని ఎంఈఓ రవి అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యసనా సామగ్రిని ప్రదర్శించారు. ఆటలు, కృత్యాలతో పిల్లలకు విద్యాబోధన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ పాఠ్యాంశాలు బొమ్మల ద్వారా బోధన, అభ్యసనం చేయాలన్నారు. ఈనెల 28వతేదీ వరకు అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వెంకటేశ్వర్లు, జే. పాండురంగయ్య, వైవీఎల్ కుమార్, మనోహర్, రఫీ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగలోని ఎస్సీ బాలిక హాస్టల్‌లో మంగళవారం వైద్యాధికారి దివాకర్, సీహెచ్ఓ వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతులను శుభ్రం చేసుకుని భోజనం చేయాలని, వేడిగా ఉన్న ఆహారాన్ని తినాలని సూచించారు. వర్షాకాలంలో ముఖ్యంగా రెండు రకాల సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, మొదటిది కలుషితమైన నీటిని తాగడంతోను, ఆహార పదార్థాలను తీసుకోవడంతో వస్తాయన్నారు. టైఫాయిడ్, డయేరియా నీళ్ల విరోచనాలు వ్యాధులు ఈ కోవకు చెందినవేనని చెప్పారు. రెండో రకం దోమల ద్వారా వచ్చే వ్యాధులన్నారు. దోమలతో మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చున్నారు. వైద్య సిబ్బంది సూచనలు పాటిస్తే వ్యాధులు సోకకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. అనంతరం కుష్టువ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వార్డెన్ సుభాషిణి, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

గోవర్ధనపురం గ్రామస్తుల నిరసన



గోవర్ధనపురం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

వరదయ్యపాళెం: మండలంలోని ఇందిరానగర్ పంచాయతీ గోవర్ధనపురం గ్రామస్తులు తాగునీటి కోసం మంగళవారం నిరసన చేపట్టారు. శ్రీకాళహస్తి-తడ ప్రధాన మార్గంలోని గోవర్ధనపురం వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. తాగునీటి సమస్యలతో అవస్థలు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాకపోకలను అడ్డుకోవడంతో రోడ్డుకిరువైపులా వాహన రాకపోకలు స్తంభించాయి. దీంతో సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ షణ్ముగం సంఘటనా స్థలానికి చేరుకుని నిరసన తెలుపుతున్న మహిళలతో చర్చించారు. వారు సమస్యలు తెలుసుకుని ఎంపీడీఓ, స్థానిక పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. తక్షణమే తాగునీటి సమస్య పరిష్కరిస్తామని వారు హామీ ఇవ్వడంతో మహిళలు నిరసన విరమింపజేశారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లండి



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు

నాగలాపురం: వ్యాపారులు ధాన్యానికి కనీస మద్దత ధర కన్నా తక్కువ ఇస్తే అధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.ప్రసాద్‌రావు రైతులకు సూచించారు. మంగళవారం ఆయన నాగలాపురం వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగలాపురం పంచాయతీ వడ్లకుప్పం గ్రామంలో వరి కోతలు జరుగుతుండడంతో మార్కెట్ ధరల గురించి, రైతులను అడిగి తెలుసుకున్నారు. కౌలు రైతులు తప్పక కౌలు రైతు గుర్తింపు కార్డులను తీసుకోవాలన్నారు. గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు వ్యవసాయ శాఖకు సంబంధించిన పథకాలను పొందగలరన్నారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు సహాయ వ్యవసాయ సంచాలకుడు సుబ్రమణ్యం, మండల వ్యవసాయాధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటు



ఏర్పేడు: వీధిలైటు అమర్చుతున్న ఎలక్ట్రీషియన్

ఏర్పేడు: మండలంలోని మేర్లపాక పంచాయతీ పరిధి గ్రామాల్లో మంగళవారం సర్పంచ్ గంగాధరం ఆధ్వర్యంలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి గ్రామాల్లోని వీధిలైట్లు పాడైపోవడంతో రాత్రిళ్ల ప్రజలు ఇబ్బందులు పడుతుండగా గుర్తించిన సర్పంచ్ వీధిలైట్లు ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరించారు. వీధుల్లో లైట్ల ఏర్పాటుపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అపరిశుభ్రతతో దోమలు చేరి డయేరియా వచ్చే ప్రమాదం ఉందన్నారు.

వీధి దీపాలు బాగు చేయండి మహాప్రభూ..!

నాగలాపురం: స్థానిక సంజీవ్‌గాంధీనగర్‌లో వారం రోజులుగా వీధి దీపాలు పాడైపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నా రు. దీంతో రాత్రి 7 గంటలు దాటిన తరువాత రోడ్లలో చిన్న పిల్లలు, వృద్ధులు నడిచి వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంది. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కుటుంబ కలహాలతో మహిళపై దాడి



మంజుల

శ్రీకాళహస్తి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళపై ఆమె బంధువులు మంగళవారం రాత్రి దాడికి పాల్పడ్డారు. బాధితురాలి కథనం మేరకు.. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎదురుగా దర్గామిట్ట వద్ద మంజుల అనే మహిళ పూలవ్యాపారం చేసుకుంటుంది. ఆమెకు శరవణ, కుటుంబసభ్యులతో కలహాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శరవణ, తన కుటుంబ సభ్యులతో కలిసి దర్గామిట్ట వద్దకు వచ్చి మంజులకు చెందిన పూలబండిని కిందతోసి ఆమెపై రాయితో దాడి చేశాడు. దీంతో ఆమె తలకు గాయం అయ్యింది. దీంతో ఆమె ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతోంది. ఈ విషయమై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా నిందితుడు శరవణ కూడా తనపై కూడా దాడికి పాల్పడ్డారని ప్రభుత్వాస్పత్రిలో చేరి నాటకాలు ఆడుతున్నాడని బాధితురాలు ఆరోపించింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా విచారించి కేసు నమోదు చేస్తామన్నారు.